చదువుల పండగకు వేళాయె

- మండల పరిధిలో జేవీకే కిట్ల సరఫరా
- పాఠశాలలకు చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు



వాకలపూడి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పుస్తకాల సరఫరాకు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్: కొత్త సంవత్సరం.. కొత్త యూనిఫాం.. కొత్త పుస్తకాలు.. కొత్త బూట్లు అబ్బో.. అన్నీ కొత్తవే. కొత్త పుస్తకం మధ్యలోకి తెరిచి వాసన చూసి మురిసిపోవడం.. వాటిలో నెమలిపింఛాలు దాచుకోవడం..ఒకటా రెండా.. ఎన్ని సరదాలో..! చిన్నారులు పరుగులెడుతూ పాఠశాలకు వెళ్లడానికి ఇంతకన్నా ఏంకావాలి? మేనమామే ముఖ్యమంత్రి అయ్యి సమయానుకూలంగా అన్నీ సమకూరుస్తుంటే చదవనని ఎవరైనా మారాం చేస్తారా? కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పేలా.. విద్యా సంవత్సరం ప్రారంభం కావడం తోనే పుస్తకాలు, యూనిఫాం వగైరా అందించేలా చర్యలు తీసుకున్నారు. బడికి వచ్చే పిల్లలకు నాణ్యమైన ఆహారంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అందించడమే కాకుండా విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.15వేలు చొప్పున అమ్మఒడి సొమ్ములు అందిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేందుకు పోటీ పడుతున్నారు.

పాఠశాలలకు పుస్తకాల తరలింపు

రూరల్ మండలంలో 77 పాఠశాలల్లో ఉండగా వీటిలో 10,651 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు తెరవనుండడంతో వారందరికీ జగనన్న విద్యా కానుక కిట్లను సిద్ధం చేసిన అధికారులు వాకలపూడి హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు తరలించారు. వీటిలో 31,953 యూనిఫారం, 54,269 నోట్ పుస్తకాలు, 6,487 బెల్టులు, 9,784 షూలు, 19,586 సాక్స్‌లు, 1431 డిక్షనరీలు, 10,651 బ్యాగులు, 1,20,098 నోట్ పుస్తకాలు, 14,320 వర్క్‌బుక్స్ ఉన్నాయి.



యూనిఫాం నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

నాణ్యమైన కిట్లు..

పేద పిల్లల చదువులకు సీఎం జగన్ పెద్ద పీట వేస్తున్నారు. విద్యార్థుల కోసం ఎంతో నాణ్యతతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం చేశారు. వాకలపూడి హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను స్వయంగా పరిశీలించాం. చాలా సంతృప్తిగా ఉంది.

– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్

పంపిణీకి సిద్ధంగా ఉంచాం

జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు తరలించాం. బడులు తెరిచిన వెంటనే పండగ వాతావరణంలో పంపిణీ చేస్తాం. వాకలపూడిలో డిస్ట్రిబ్యూషన్ సెంటరులో జగనన్న విద్యా కానుక కిట్లలో మెటీరియల్‌ను ఎమ్మెల్యే కన్నబాబు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

– ఎల్.గణేష్‌బాబు, ఎంఈఓ

పేదల ఇళ్లకు 650 ఎకరాల అభివృద్ధి



పట్టాల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు, కమిషనర్ మహేష్‌కుమార్ తదితరులు

- ప్రైవేటు లేఅవుట్లకు దీటుగా వసతులు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నియోజకవర్గ పరిధిలో పేదల సొంత ఇళ్ల కోసం 650 ఎకరాలను కొనుగోలు చేసి అభివృద్ధి చేసినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ భూముల్లో దాదాపు 33 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. జగన్నాథపురం ప్రాంతవాసులకు చొల్లంగి గ్రామంలో కేటాయించిన స్థలాలను లబ్ధిదారులకు వాహనాల్లో తీసుకువచ్చి గురువారం పండగ వాతావరణంలో పంపిణీ చేశారు. పేదలకు సొంతింటి కలను దూరం చేసేందుకు టీడీపీ నాయకులు శతవిధాల ప్రయత్నించారని, అయినప్పటికీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంకల్పం ముందు వారి కుట్రలు సాగలేదని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజలకు సొంత గూడు సమకూరుతుంటే చంద్రబాబు, కొండబాబు తట్టుకోలేకపోయారన్నారు. అందుకే దుమ్ములపేట వద్ద 115 ఎకరాల స్థలాన్ని పేదలకు దక్కకుండా అడ్డుపడ్డారని, టీడీపీ మనుషులతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆటంకాలు కల్పించారన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి సంకల్పబలం ముందు వారి ఆటలు సాగలేదని చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు 10వేల మందికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చామని, నేడు అంతకు మించి 33 వేల మందికి స్థలాలు ఇచ్చామని తెలిపారు. ప్రతి మహిళకు ధైర్యం, శక్తి, గౌరవం దక్కాలనే లక్ష్యంతో వారి పేరునే పట్టాలు ఇచ్చామన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ చొల్లంగి, కొమరగిరి, ఏపీ త్రయం, పండూరు వంటి ప్రాంతాల్లోని స్థలాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు సీఎం జగన్ చిత్రపటాలను, ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, టీపీఆర్వో మానే కృష్ణ మోహన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి ప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్, పార్టీ కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఈత కొలను నెలవారి అద్దె ప్రకారం లీజుకు తీసుకోవడానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌ఏ సీఈఓ షేక్ ఇమ్రాన్ గురువారం తెలిపారు. 25x13మీటర్ల ఈత కొలనుకు శాప్ వెబ్‌సైట్ www.sports.ap.gov.in నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తుకు రూ.10 వేల డీడీతో పాటు ఈనెల 11లోపు ఈమెయిల్ ఐడి saap.coacher@-gmail.com పంపవలసిందిగా శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ కోరినట్టు డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

బాధితులకు పరిహారం పెంచాలి

బోట్‌క్లబ్: కోరమాండల్ రైలు ప్రమాదంలో మరణించిన వారి బంధువులకు ఇచ్చే పరిహారాన్ని ప్రభుత్వం పెంచాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు పెంచాలన్నారు.

జీవితంలో క్రీడలూ భాగం కావాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు: జీవితంలో క్రీడలు భాగం కావాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించిన శిబిరాన్ని పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. నెలరోజుల పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో శిక్షణ ఇచ్చారన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్స్‌లో రెండు మ్యాచ్‌లు




మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పన్న

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. నో ఏజ్ లిమిట్ విభాగంలో గురువారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో కరప సీఏకే ఫ్రెండ్స్ జట్టుపై పందలపాక జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా లీల నిలిచాడు. రెండో మ్యాచ్‌లో ఓదూరు జట్టుపై చొల్లంగిపేట జట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రాజేష్ (చొల్లంగిపేట) నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను విజేతలకు స్పాన్సరర్ వైఎస్సార్ సీపీ నాయకుడు చుట్టూరి అప్పన్న అందజేశారు.

మంత్రివర్గ నిర్ణయాలపై వైఎస్సార్‌టీఎఫ్ హర్షం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలపై వైఎస్సార్ టీఎఫ్ జిల్లా శాఖ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఏపీ గ్యారంటీ స్కీమ్, పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు, పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పథకాలు, ప్రజలు చొరవతో పాటు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు నక్కా వేంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీరవల్లి గోపికృష్ణ ఉన్నారు.

సారా బట్టీలపై దాడులు



పట్టుబడ్డ సారా, బెల్లపు ఊటతో ఎస్‌ఈబీ అధికారులు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో ఎస్‌ఈబీ అధికారులు గురువారం దాడులు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ జేడీ ఆధ్వర్యంలో పెద్దాపురం ఎస్‌ఈబీ ఇన్‌చార్జి సీఐ స్వామి, సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ వెలుగుల సురేష్ దాడి చేశారు. ఆయా గ్రామాల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని 24 లీటర్ల సారా, 120 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వామి తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అజయ్‌కుమార్ సింగ్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కార్పొరేషన్ కమిషనర్ మహేష్‌కుమార్
- ప్రపంచ మహా సముద్ర దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్ తదితరులు

కాకినాడ రూరల్: సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల పిలుపునిచ్చారు. ప్రపంచ మహా సముద్ర దినోత్సవం సందర్భంగా సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌ను ఉదయం 6 గంటల నుంచి రెండు గంటల పాటు శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పీఆర్ కళాశాలలోని జువాలజీ, ఓషన్ సొసైటీ, 90.8 ఎఫ్‌ఎం రేడియో, ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్, అలయన్స్ క్లబ్, పర్యావరణ పరిరక్షణ సమితి తదితర సంస్థల సహకారంతో స్వచ్ఛ బీచ్ పేరిట బీచ్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి ద్వారా చేతి సంచులను పంపిణీ చేశారు. అనంతరం యోగా గురువులు చిట్టిబాబు, సత్యప్రియలు జూన్ 21న యోగా డే అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు, పీఆర్ కళాశాల పీడీ రమణారావు, అధ్యాపక సిబ్బంది, బీజేపీ నాయకురాలు పితాని లీలావతి పాల్గొన్నారు.

నియామకాలకు తాత్కాలికంగా బ్రేక్

- ఉద్యోగులకు అన్యాయం జరగనివ్వం
- ఏపీఎన్‌జీవో నేతలకు కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీఎన్‌జీవో నేతలు

కాకినాడ క్రైం: బదిలీల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ కేడర్ల భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరిన ఏపీఎన్‌జీవో నేతల విజ్ఞాపనకు కలెక్టర్ కృతికా శుక్లా సానుకూలంగా స్పందించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్ అధ్యక్షతన నేతలు గురువారం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగులకు మంచి చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న బదిలీలపై నిషేధం ప్రయోజనాలను అందిపుచ్చులోని స్థితి ఎదురైందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సరిగ్గా ఇదే సమయంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో ఫార్మసిస్ట్, ఎల్‌టీలతో పాటు పలు కేడర్ల భర్తీ ప్రక్రియ చేపడుతోందన్నారు. అధికారుల నిర్ణయంతో ఏళ్లకేళ్లు లూప్‌లైన్‌లో పనిచేస్తున్న ఎందరో ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశం కోల్పోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అందించిన విన్నపంపై నియామకాలను తాత్కాలికంగా నిలిపివేస్తామని కలెక్టర్ కృతికా శుక్లా వారికి హామీ ఇచ్చారు. ఆ దిశగా డీఎంహెచ్‌వోకి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో సంఘ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, జిల్లా కోశాధికారి వై.పద్మమీనాక్షి, జిల్లా కార్యదర్శి పేపకాలయ వెంకటకృష్ణ, సహాయ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సరేళ్ల చంద్రరావు, పాలపర్తి మూర్తిబాబు తదితరులున్నారు.


ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

బాలాజీచెరువు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించగా నగరంలో వివిధ పాఠశాలల నుంచి దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఏఎంజీ స్కూల్ ఉపాధ్యాయులు చినబాబు, సంజీవ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రామకృష్ణ వ్యవహరించారు. విజేతలకు శనివారం సాయంత్రం వాసవీ ఆలయంలో బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉప అధికారి వేంకటేశ్వరరావు, కిశోర్, రాజు పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మ స్వీకరణ పత్రాలు అందజేత



తాళ్లరేవులోని ఆనంద బోధి బుద్ధ విహార్‌లో పత్రాలను అందజేస్తున్న హరిబాబు

తాళ్లరేవు: బౌద్ధ దమ్మ విధానాన్ని అనుసరించి స్వీకరణ చేస్తామని హామీ ఇచ్చిన 12 మందికి బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు వై.హరిబాబు బౌద్ధ దమ్మ స్వీకరణ పత్రాలు అందజేశారు. హరిబాబు తాళ్లరేవులోని ఒక బౌద్ధ వివాహంలో పాల్గొన్న అనంతరం ఆయన తాళ్లరేవులోని ఆనంద బోధి బుద్ధ విహారాన్ని సందర్శించారు. మండలానికి చెందిన బౌద్ధ ఉపాసకులు బీఎస్‌ఐ సభ్యులతో బౌద్ధ ప్రచారానికి చేయాల్సిన విధులు, విధానాలు చర్చించారు. కార్యక్రమంలో గుత్తాల సుబ్రహ్మణ్యం, వడ్డి సిద్ధార్థ, బీఎస్‌ఐ నాయకులు దారా సుబ్బరాజు, బీఎస్‌ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎడ్ల కుటుంబరావు, మండల కార్యదర్శి దడాల రామకృష్ణ, పెయ్యల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కో-ఆర్డినేటర్‌కు అభినందనలు



శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: కేంద్ర యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో నోయిడాలో నిర్వహించిన ఖేలో ఇండియా గేమ్స్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించిన జేఎన్‌టీయూకే వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌ను గురువారం తన చాంబర్‌లో వీసీ ప్రసాదరాజు అభినందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించడం సంతోషమని, జేఎన్‌టీయూకే వర్సిటీకి ఈ అవకాశం వచ్చిందన్నారు. మే 25 నుంచి జూన్ 3 వరకూ యూపీలో 22 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించగా, 23 నుంచి 28వ తేదీ వరకూ గ్రేటర్ నోయిడాలో కబడ్డీ పోటీలు నిర్వహించారన్నారు. పోటీలు దిగ్విజయంగా నిర్వహించి కీలకపాత్ర పోషించిన శ్యామ్‌ను డైరెక్టర్లు, టీచింగ్ నాన్‌టీచింగ్ సిబ్బంది అభినందించారు.

ఒక బైక్, ఐదు సెల్‌ఫోన్‌లు మాయం

తాళ్లరేవు: వేరు వేరు ఇళ్లలో బైక్‌తో పాటు సెల్‌ఫోన్‌లు మాయమైన ఘటన కోరంగి పంచాయతీ సీతారామపురంలో చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున తాళ్లరేవు సచివాలయ సెక్రటరీ టేకుమూడి వేణుగోపాల్‌కు చెందిన మోటార్ బైక్, దుప్పి వాసుదేవ ఇంట్లో రెండు సెల్‌ఫోన్లు, సూర్యనారాయణ ఇంట్లో ఒక సెల్‌ఫోన్, మరో ఇంట్లో రెండు సెల్‌ఫోన్‌లు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కోరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.


పాత్రికేయుల సేవలు అభినందనీయం

కాకినాడ సిటీ: గత 45 రోజులుగా స్థానిక పాత్రికేయులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఏపీ ఎన్‌జీవో సంఘ ఉమ్మడి జిల్లా నాయకులు గుద్దటి రామమోహన్‌రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తి బాబులు అన్నారు. గురువారం వీరు ఇతర ఎన్జీవో సంఘ నాయకులతో కలసి కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరాంకుమార్ సహకారంతో కాకినాడ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని సందర్శించి మజ్జిగను అర్జీదారులకు, బాటసారులకు, వాహనదారులకు అందజేశారు. ఎన్జీవో నాయకులు పద్మా మీనాక్షి, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ల చంద్రరావు, ప్రసాద్, అజీజ్, సత్తిరాజు, ఛటర్జీ తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు

కరప: మండలం యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కరప విష్వాలయంలోని వెంకటేశ్వర స్వామికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

సత్యెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

కరప: మండలం కొరిపల్లి గ్రామంలో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవిశెట్టి సూర్యప్రకాష్ తదితర గ్రామస్తులతో కలసి జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామస్తుల వినతి మేరకు సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు.

ముందస్తు సాగుకు సమాయత్తమవ్వండి

జేడీఏ విజయ్‌కుమార్



ముందస్తు సాగుకు కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప: ఈనెల ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు వదిలారని, రైతులను చైతన్యపరచి సార్వాలో ముందస్తు సాగుకు సమాయత్తం చేయాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. సరైన కార్యాచరణతో సార్వా, రబీలలో ముందస్తు సాగు చేపడితే మూడో పంటగా అపరాలు సాగుచేయవచ్చని రైతులకు వివరించాలన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వీఏఏలు, ఏఈఓలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ సార్వాలో వెదజల్లు పద్ధతి అమలయ్యేలా చూడాని, ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో నాలుగైదు పంటలు వేసేలా రైతులను చైతన్యపరచాలన్నారు. తొలకరి పంట అక్టోబరు నెలాఖరు నాటికి కోతలు పూర్తయేలా చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీకల్లా నారుమళ్లు వేసేలా చూడాలన్నారు. రబీలో నవంబరు నెల 15 నుంచి డిశంబరు 15లోగా వరినాట్లు పూర్తిచేయించాలన్నారు. సాగుఖర్చు తగ్గించేందుకు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను ప్రోత్సహించాలన్నారు. ఏడీఏ కె.బాబూరావు రూపొందించిన ముందస్తు సాగుకు కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను జేడీఏ ఆవిష్కరించారు. వీఏఏలకు విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, ఎరువుల, పురుగుల మందుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం (పెద్దాపురం) డీడీ బీవీఎస్‌సీ హరి, కాజులూరు, తాళ్లరేవు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి చర్యలు

కమిషనర్ మహేష్‌కుమార్



ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించిందని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల తెలిపారు. గురువారం జగన్నాథపురంలోని ఫస్ట్ రిఫరల్ యూనిట్‌ను ఆయన సందర్శించి అక్కడి సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రహదారుల అభివృద్ధిపై సమీక్ష

అచ్చంపేట జంక్షన్ నుంచి కాకినాడ డీప్ వాటర్ సీపోర్టు వరకు 13 కిలోమీటర్ల పరిధిలో రహదారి నిర్మాణం నేపథ్యంలో ఆ రహదారికి అనుబంధంగా నిర్మించాల్సిన కల్వర్టులు, ఇతర అభివృద్ధి పనులపై కమిషనర్ మహేష్‌కుమార్ గురువారం సమీక్షించారు. కోరమండల్, ఎస్‌ఎఫ్‌సీఎల్, నీటిపారుదల శాఖ, ఏపీఐఐసీ, నగరకసంస్థ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రహదారిని ఆనుకుని నిర్మించే డ్రైన్లు మురుగునీటి ప్రవాహానికి అవరోధం లేకుండా చూడాలన్నారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ



వలసపాకలలో వనుం పెద్దమాచర్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలంలోని పలుగ్రామాల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలసి పర్యటించి పలువురు బాధితులను పరామర్శించారు. విజయరాయుడుపాలెంలో చింతా మేరికుమారి మృతిచెందగా ఆమె కుమారుడు మూలాస్వామి, బూలా సువర్ణజ్యోతి మృతిచెందగా ఆమె భర్త బూలా మధును, వలసపాకలలో వనుం పెద్దమాచర్రావు మృతిచెందగా భాస్కర్ తదితర కుటుంబసభ్యులను, కొరిపల్లి గ్రామంలో పెంకే చరిష్మా మృతి చెందగా ఆమె తండ్రి పెంకే శ్రీనివాస్‌లను ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌లు వెలుగుబంటి సీతారామరాఘవ, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర నుంచి రక్షణ కల్పించండి

కాకినాడ సిటీ: రాజులపూడి ఆరుద్ర తమ కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తూ తన కుమారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ విధులు నిర్వర్తిస్తున్న వీరవెంకట సత్యనారాయణ, నాగ కన్నయ్యల తల్లి చిన్న అమ్ములు జిల్లా అధికారులను కోరారు.

గురువారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద తన వికలాంగుడైన మనవడితో కలసి ఆమె ధర్నా చేశారు.